ప్రజాశక్తి

బుధవారం 6 ఆగస్టు 2025



ఐఎబి ఎప్పుడో..?

ఆయకట్టు రైతుల్లో అయోమయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఎబి) సమావేశం ఎప్పుడన్న దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఒకవైపు జిల్లాకు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా రెండింటి నుంచి నీళ్లు చాలాకాలంగానే వస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ కూడా ఆరంభమై రైతులు పంటల వేసుకునే పనుల్లోనున్నారు. అయితే ఆ ప్రాంతంలో ఎప్పుడు నీళ్లు ఇస్తారన్న దానిపై ఇప్పటికీ స్పష్టతలేదు. అది రావాలంటే ఐఎబి సమావేశం కీలకంగా జరగాల్సి ఉంటుంది. ఈ సమావేశంలో అనంతపురం జిల్లాతోపాటు, సత్యసాయి, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిదులు కూడా పాల్గొనాల్సి ఉంటుంది. ఆ సమావేశంలో ఏ ప్రాంతానికి ఎప్పుడు నీళ్లు ఇవ్వాలి. ఏమేరకు కేటాయింపులు జరపాలన్నది నిర్ణయం చేయాల్సి ఉంది.

ప్రధానంగా హెచ్ఎల్‌సి పరిధిలో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్, మధ్యపెన్నార్ ఉత్తర, దక్షిణ కాలువలు, తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్, పులివెందుల బ్రాంచ్ కెనాల్, పిఎబిఆర్ కుడికాలువ కిందనున్న కాలువలకు నీరు విడుదల చేయాల్సి ఉంది. దామాషా పద్ధతిలో తుంగభద్ర నుంచి నీటి లభ్యత ఆధారంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు కేటాయిస్తారు. ఆ దామాషాలోనే ఈ కాలువలకు నీటి కేటాయింపులు జరిపి తేదీలను ముందస్తుగా ప్రకటించాలి. ఈసారి తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు ముందుగానే వచ్చింది. దీంతో ఎగువ ప్రదాన కాలువకు నీటిని ముందస్తుగా విడుదల చేసుకునే అవకాశమున్నా మరమ్మతుల కారణంగా కొంత ఆలస్యంగా నీటిని తీసుకోవడం జరిగింది. జిల్లాకు ప్రస్తుతం 1862 క్యూసెక్కు లనీరు వస్తోంది. ఇందులో నుంచి ఇప్పటికే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌కు నీటిని అధికారులు విడుదల చేశారు. దిగువనున్న మిడ్‌పెన్నార్ ఉత్తర, దక్షిణ కాలువలకు ఎప్పుడు నీరు విడుదల చేస్తారన్నది తెలియదు. దీంతో ఆ ప్రాంతంలో రైతులు పంటల సాగు ఎలాగన్నది అయోమయంగా ఉంది. డ్యామ్‌లో గతంలోలాగా పూర్తి సామర్థ్యంతో ఈసారి నిలువ ఉంచడానికి వీల్లేనందున నీటి లభ్యత గతేడాది అంత ఉండకపోవచ్చునని అధికారులు చెబుతున్నారు. ఇటువంటి తరుణంలో ఆయకట్టు రైతులకు మరింత స్పష్టతను ముందస్తుగా ఇవ్వాల్సి ఉంటుంది. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఈ నిర్ణయాలు చేయడంలోనూ జాప్యం జరుగుతోందన్న చర్చ నడుస్తోంది.

హంద్రీనీవాకు లెక్కల్లేవు..

హంద్రీనీవాకు ఈసారి ముందస్తుగానే నీరొస్తోంది. ఈసారి కాలువ వెడల్పుకు కూడా పెంచడంతో ప్రవాహ సామర్థ్యం పెరిగింది. దీంతో గతం కంటే ఎక్కువ నీళ్లు తీసుకునే వెసలుబాటుంది. అయితే ఈ నీటిని వాడకం విషయంలో ఎక్కడా సరైన లెక్కల్లేవు. ఎందుకంటే ఇప్పటి వరకు అటువంటి కేటాయింపులు అధికారికంగా లేవు. దీంతో అధికారులు, నేతల ఒత్తిడి మేరకు ఎక్కడ బడితే అక్కడ వాడేస్తున్నరన్న విమర్శ ఉంది. కనీసం ఈసారి అయినా ఐఎబిలో ఈ నీటి వాడకంపై లెక్కలు తేలుస్తారా లేక ఎప్పటిలాగా బలాన్ని బట్టి నీటిని తీసుకెళుతారోనన్నది చూడాల్సి ఉంది.

హామీలు విస్మరించి బాదుడా..?

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూఆప్ ఛార్జీల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారులు, ప్రజలపై మోయలేని భారం మోపుతున్నాయని, తక్షణం వీటిని ఆపాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూ ఆఫ్ చార్జీలు ఉప సంహరించాలని కోరుతూ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భారాల పాలనను నాయకులు ఎండగట్టారు. ధర్మవరం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం నాయకులు ఎస్‌హెచ్.బాషా, ఎ.మారుతి, సిపిఐ నాయకులు పి.రవికుమార్, వై.రమణ, సిఐటియు నాయకులు జెవి.రమణ, టి.అయూబ్ ఖాన్ మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల విషయంలో కూటమి నాయకులు ఎన్నికల ముందు ఒక మాట ఇప్పుడు ఒక మాట చెబుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లను పగలగొట్టమని చెప్పిన చంద్రబాబు, లోకేష్ ఇప్పుడెందకు వాటిని బిగిస్తున్నారని ప్రశ్నించారు. ట్రూ ఆప్, సర్‌ఛార్జీల పేరుతో జనంపై విద్యుత్ ఛార్జీల భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్.ఆదినారాయణ జి.హరి, ఎ.ఖాదర్ బాషా, వి.వెంకటస్వామి, సుబ్రహ్మణ్యం, జెబీఉల్లా, అబ్బాస్, ఎఐవైఎఫ్ నాయకులు రాజా, వెంకటస్వామి పాల్గొన్నారు.



ధర్మవరంలో విద్యుత్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్తున్న సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు

- జనంపై విద్యుత్ భారాలు దుర్మార్గం
- ఎన్నికల ముందు ఏమి చెప్పారో గుర్తులేదా..?
- స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షనం ఆపాలి
- విద్యుత్ ఛార్జీలభారంతో జనం అవస్థలు
- ప్రభుత్వం స్పందించకుంటే తిరుగుబాటు తప్పదు
- వామపక్ష, ప్రజాసంఘాల నాయకుల హెచ్చరిక

నంబులపూలకుంట : వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లను వేస్తే అడ్డుకుంటామని రైతుసంఘం నాయకులు స్పష్టం చేశారు. స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయొద్దని కోరుతూ ఏపీ రైతు సంఘం నాయకులు సోమిరెడ్డి, మల్లిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు కాటకాలతో వ్యవసాయం చేయడమే గగనం అయిన నేపథ్యంలో ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాల్సింది పోయి స్మార్ట్‌మీటర్ల పేరుతో భారాలు వేయడం సరికాదన్నారు.

నల్లచెరువు : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం ఎదుట సిపిఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు శ్రీరాములు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తే అడ్డుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటస్వామి, సిపియం మండల కమిటీ సభ్యులు శ్రీరాములు పాల్గొన్నారు.


తనకల్లు : మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయొద్దని కోరుతూ విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల కమిటీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివన్న, రమణ, వీర నారాయణ, పారేష్, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



బుక్కపట్నంలో విద్యుత్ వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు



తనకల్లులో..



నంబులపూలకుంటలో..

ఆగస్టు 15 వేడుకలను

వైభవంగా నిర్వహిద్దాం : కలెక్టర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 15న స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించే వేడుకల్లో జెండావందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వేదికను అలంకరించాలని ఆదేశించారు. భారీ గేట్లు, వైట్ వాష్ తదితర ఏర్పాట్లను ఆర్అండ్‌బి అధికారులు చేపట్టాలన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరు అయ్యే వారికి తాగునీటి సరఫరా, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం అందరికీ అవకాశం కల్పించాలన్నారు. జిల్లాలో సాధించిన ప్రగతిని చాటి చెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు డిఇఒ పర్యవేక్షణలు చేయాలన్నారు. వేడుకలు ముగిసేంత వరకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారిని ఆదేశించారు. ఆయా శాఖలో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయడానికి సంబంధిత జాబితాను నిర్ణీత గడువులోపు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో సువర్ణ, డిఇఒ క్రిష్టప్ప, విద్యుత్ శాఖ అధికారి సంపత్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అర్హత అభ్యర్థులకు సన్మానం

ప్రజాశక్తి-తాడిమర్రి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో అర్హత సాధించిన మండల పరిధిలోని పలు గ్రామాల విద్యార్థులను మంగళవారం స్థానిక గ్రంథాలయంలో సన్మానించారు. తాడిమర్రి మండలానికి సంబంధించి శ్రీకాంత్, ఓంకార్, వినోద్, దేవేంద్ర గౌడ్, వీరేంద్ర, సునీల్ పవన్, కిరణ్ కుమార్ రెడ్డిలు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. వీరు గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలను చదువుకుని ఈ ఉద్యోగాలు సాధించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను గ్రంథాలయ అధికారి శీనానాయక్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరై వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకులు, నిరుద్యోగులు గ్రంథాలయాలను ఉపయోగించుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. పోలీసుల విధులను అంకిత భావంతో నిర్వహించాలని ఆమె తెలియజేశారు. నిరుద్యోగ యువతకు అవసరం అయ్యే పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతున్న గ్రంథాలయ అధికారి శీనా నాయక్‌కు ఎస్ఐ ధన్యవాదాలు తెలిపారు.

స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం : కమిషనర్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాల్టీలో అనుమతులు లేకుండా ఉన్న లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకోవడానికి ప్లాన్ అప్రూవల్ కోసం ఇబ్బంది పడుతున్న వారికి క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తున్నట్లు కమిషనర్ క్రాంతికుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 13 లేఅవుట్లను గుర్తించామన్నారు. ఈ ఏడాది జూన్ 30 వరకు ఎక్కడైతే అనుమతులు లేకుండా లేఅవుట్లు వేశారో వారందరూ ఎల్ఆర్ఎస్ పరిధిలోకి వస్తారన్నారు. నిర్ణీత గడువులోపు సంబంధిత ఎల్ఆర్ఎస్‌లో ఒక ఫ్లాట్ అయినా విక్రయించిన వారు రిజిస్టర్ పత్రాలు చూసి క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. మార్కెట్ విలువలో 10 నుంచి 30 శాతం వరకు అపరాధ రుసుం చెల్లించి ప్రతి ప్లాటును క్రమబద్ధీకరించుకోవచ్చు అన్నారు. ఈ నెల 4 నుంచి ఆన్‌లైన్లో పోర్టల్ అందుబాటులో ఉంటుందని, సరైన ధ్రువీకరణ పత్రాలతో ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అన్ని సక్రమంగా ఉంటే మూడు రోజులలో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని మున్సిపాలిటీ పరిధిలో స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇల్లు కట్టుకోవడానికి మంజూరు కోసం ఇబ్బందులు పడుతున్న వారు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'


ప్రజాశక్తి-హిందూపురం

పంటల సాగుకు రైతులను సన్నద్ధం చేయడంలో భాగంగా మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హిందూపురం రూరల్ మండల పరిధిలోని సంతేబిదనూరు, బేవినహళ్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి సురేంద్రనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న, కంది పంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి మహేష్ నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి పుష్పలత, రైతు సేవా కేంద్రం సిబ్బంది చంద్ర శేఖర్, రైతులు శ్రీరాములు, అంజినప్ప, నాగరాజు పాల్గొన్నారు.

జనసేనలో మహిళలకు గుర్తింపు

ప్రజాశక్తి-కదిరి టౌన్

జనసేన పార్టీలో మహిళలకు రాజకీయ గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ నాయకులు తెలియజేశారు. కదిరి నియోజకవర్గంలో జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేసిన ఎన్‌పి.కుంట మండలం మేకల చెరువు గ్రామానికి చెందిన అనసూయకు కదిరి మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చారు. మంగళవారం నాడు కదిరి పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథి గృహంలో బలిజ కులస్తులు మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ అనసూయను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతవరకు ఏ పార్టీ అవకాశం ఇవ్వలేదని మొదటిసారి కూటమి ప్రభుత్వం జనసేన పార్టీ ప్రాధాన్యతఇస్తూ మహిళలకు మార్కెట్‌యార్డు ఛైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, నియోజకవర్గ నాయకులు మంచి శివశంకర్, బలిజ కులస్తులు,మహిళలు పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డు ఛైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న బలిజ సంఘం నాయకులు

కార్పొరేట్ల కోసమే భూముల సేకరణ

- బలవంతపు భూసేకరణ ఆపాలి
- వ్యకాసం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు
- 10న విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్పొరేట్ల కోసం రైతుల సాగు భూమిని బలవంతంగా లాక్కోవాలని చూస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు విమర్శించారు. సోలార్ తదితర వాటి పేరుతో పంటలు పండే భూములను ప్రభుత్వం బలవంతంగా సేకరించడాన్ని ఆపాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శ్రీ సత్య సాయి జిల్లా కార్మిక కర్షక భవనంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో సాగుభూములను ప్రభుత్వం బలవంతంగా తీసుకుంటోందని విమర్శించారు. 2013 భూసేకరణ చట్టం అమల్లో ఉండగా దీనిని తుంగలో తొక్కి అడ్డగోలుగా భూములను తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివద్ధి, ఉపాధి అవకాశాలు, సాగునీటి ప్రాజెక్టుల కోసం భూముల సేకరిస్తే ఎవరూ అభ్యంతరం చెప్పరని, అభివృద్ధి చాటున అవసరాలకు మించి భూమిని సేకరించడం హర్షనీయం కాదన్నారు. రైతుల నుంచి భూములు సేకరించి కార్పొరేట్లకు అప్పగించే కుట్రను అడ్డుకుంటామన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా బలవంతపు భూ సేకరణ ఆపాలని ఈనెల 10వ తేదీన విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో రైతులు, కూలీలు, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్ కుమార్, అధ్యక్షులు వెంకటేష్, సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, నారాయణ, వెంకటరమణ, పెద్దన్న వెంకట లక్ష్మమ్మ, రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

వ్యకాసం జిల్లా కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ఫిరంగి ప్రవీణ్‌కుమార్

శ్రీ సత్య సాయి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. పుట్టపర్తిలోని కార్మిక, కర్షక జిల్లా కార్యాలయంలో మంగళవారం నాడు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా వెంకటేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఫిరంగి ప్రవీణ్ కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, ఉపాధి కూలీల సమస్యలపై వ్యకాసం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ద్వారా అందే సంక్షేమ పథకాలను వారికి అందించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. గ్రామీణ వ్యవసాయ కూలీల సంఘం ఏర్పాటు చేసి పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగధర్, కమిటీ సభ్యులు, స్వర్ణలత, వెంకటరాముడు, నారయణ, పెద్దన్న రామ లక్ష్మి, వెంకట లక్ష్మమ్మ పాల్గొన్నారు.



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, ప్రవీణ్‌కుమార్

రైతు సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు



కృతజ్ఞత ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎంఎల్‌సి

ప్రజాశక్తి-మడకశిర టౌన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలియజేశారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతు ఖాతాల్లో రూ.5000 జమ చేసిన సందర్భంగా మడకశిరలో రైతులు కతజ్ఞత ర్యాలీని మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గంలోని వందలాది ట్రాక్టర్లతో తరలివచ్చి మెట్టబండ ఆంజనేయ స్వామి దేవస్థానం నుంచి వాల్మీకి సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగించారు. ఎమ్మెల్యే తో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మూర్తిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్.రాజు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను ఆగస్టు 15 లోపు అమలు చేసిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అభివద్ధి సంక్షేమ రెండు అమలు చేస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి అన్నారు. వైసిపి నాయకులు రోజుకు రోజుకు కుంభకోణంలో జైలు పాలవుతున్నారన్నారు. తాము అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుతూ ప్రజల్లో మమేకమవుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గురుమూర్తి మున్సిపల్ ఛైర్మన్ నరసింరాజు, ఐదు మండలాల కన్వీనర్లు, ఎంపీపీలు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'టీ తాగుదాం చర్చించుకుందాం'

ఏపీజీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, రామాంజనేయులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ నూతనంగా టీ తాగుతూ చర్చించుకుందాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు స్థానిక ఏపీ ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 5వ తేదీ నుండి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్నా క్యాంటీన్ ఆవరణంలో 'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ గత పాలకులు ఉద్యోగుల బకాయిలు పరిష్కరించాలని సమస్యల తోరణంతో ధర్నాలకు వెళితే ఉద్యోగులను దేశద్రోహులుగా భావించి రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణను అరెస్టు చేసే ప్రయత్నం చేశారన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం చేయని ప్రభుత్వాలు మనకెందుకని మనం నూతనంగా కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పైబడిన ఇంకా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఇప్పటికే ఉద్యోగులకు సుమారు రూ.25 వేల కోట్ల ప్రభుత్వం బకాయి ఉందని, ఈ మొత్తాన్ని ఎలా తీరుస్తారో అర్థం కావడం లేదన్నారు. రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమంలో కూడా ఏదైనా ఉద్యోగ సమస్యలు ఉంటే తన దష్టికి తీసుకువస్తే సత్వరం జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వంపై వ్యతిరేకంతో తాము ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని, ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్దేశంతోనే సానుకూలంగా రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం ద్వారా ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం దష్టికి తీసుకెళుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, హిందూపురం తాలూకా కార్యవర్గ సభ్యులు జగదీష్, హర్షద్, ప్రహ్లాద రెడ్డి, శివరాజ్, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఉద్యోగులు

పిడుగు పడి మహిళ మృతి

ప్రజాశక్తి-మడకశిర

మండల పరిధిలోని ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన పొలాల్లో గొర్రెలు మేపుతున్న మహిళా గొర్రెల కాపరి పిడుగుపాటుకు మంగళవారం మరణించింది. గ్రామానికి చెందిన రత్నమ్మ(45) గొర్రెల మేత నిమిత్తం జీవాలను తీసుకుని గ్రామ శివారు వద్దకు వెళ్లారు. మంగళవారం సాయంత్రం పిడుగులతో కూడిన వర్షం పడడంతో రత్నమ్మ అక్కడికక్కడే మరణించింది. ఈమెతో పాటు రెండు గొర్రెలు కూడా మరణించాయి.

జిల్లాలో 947.0మిమీ వర్షపాతం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి 947.0 మీమీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా గణాంకాల అధికారులు తెలిపిన వివరాల మేరకు జిల్లాలో 32 మండలాలకు గాను తలుపుల మండలం మినహా అన్ని మండలాలలో వర్షపాతం నమోదయింది. అత్యధికంగా గాండ్లపెంటలో 71.2, సోమందేపల్లి 56.4, పుట్టపర్తి 55.4, అగళి 48.6, పెనుకొండ 48.2, కొత్తచెరువు 43.2, వర్షపాతం నమోదు కాగా మిగతా మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది. అత్యల్పంగా ఎన్‌పి కుంటలో 1.6 మీమీ వర్షపాతం నమోదయింది. ఈ వర్షం వల్ల పలు గుంటలలో చెక్ డ్యాములలో నీరు వచ్చి చేరింది.

ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్యచికిత్సలు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

భవితా కేంద్రంలో విభిన్న ప్రతిభవంతుల పిల్లలకి మెడికల్ అసెస్మెంట్ క్యాంప్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా ఐఈ కోఆర్డినేటర్ ఆనంద్ బాబు, కదిరి మండల ఎంఈఓలు చిన్నకృష్ణ, ఓబుల్ రెడ్డి, ఓడిసి మండలం ఎంఈఓ రమణ హాజరయ్యారు. ఆనంద్‌బాబు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకి సేవ చేయడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. వికలాంగ పిల్లలకు వారికి అవసరమైన పరికరాలను అందిస్తున్నట్లు తెలియజేశారు.

పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి మండలం పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం అధిగమించాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన గర్భవతుల నమోదుల సంఖ్యను పూర్తి స్థాయిలో చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ వినోద్ కుమార్, సిహెచ్ఓ లక్ష్మీదేవమ్మ, సూపర్‌వైజర్లు పద్మజ, విజయశేఖర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పి-4 టెలీకాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి-4 నిర్వహణపై ముఖ్యంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఇందుకు సంబంధించి మున్సిపల్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వెంకటప్రసాద్ ఆర్డీవో వివిఎస్.శర్మ ఇందులో పాల్గొని కదిరి నియోజకవర్గంలో పి-4 అమలుపై వివరాలను తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-గాండ్లపెంట

మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఏడు సచివాలయ పరిధిలోని మైనార్టీలకు కులాల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, ఆధార్ లింకు రేషన్ కార్డులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

7న వికలాంగులకు ప్రత్యేక క్యాంపు

ప్రజాశక్తి-కొత్తచెరువు

వికలాంగులకు అవసరం అయ్యే పరికాలు ఇచ్చేందుకు ఈ నెల 7వ తేదీన కొత్త చెరువు సత్యసాయి భజన మందిరంలో ప్రత్యేక క్యాంపును ఎఎల్ఎ సిఓ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయుడు మల్లెల శ్రీనివాసులు తెలిపారు. 6 నుంచి 18 సంవత్సరాల లోపు ఉన్న విద్యార్థులకు పరికరాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కొత్తచెరువు బుక్కపట్నం, పుట్టపర్తి, గోరంట్ల నల్లమాడ మండలాలకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొలం పిలుస్తోంది

ధర్మవరం రూరల్ : మండలంలోని గొట్లూరు గ్రామంలో సహాయ వ్యవసాయ సంచాలకుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వేరుశనగ, కంది పంటల సాగు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, విస్తరణాధికారి అశ్విని, బిటిఎం ప్రతిభ, విహెచ్ఎ ఆశాజ్యోతి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆజాద్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల పనితీరు భేష్

విజయనగరం పీడీ శ్రీనివాస్ ఫణి

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షి మండలంలో మహిళా సంఘాల పనితీరు చాలా బాగుందని విజయనగరం పీడీ శ్రీనివాస ఫణి తెలియజేశారు. మంగళవారం మండలం కేంద్రంలోని నందీశ్వర మండల సమైక్య కార్యాలయంలో జిల్లా సమైక్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస పణి మహిళా సంఘాల పనితీరును తెలుసుకున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న వక్తలు

ప్రజాశక్తి-ధర్మవరంరూరల్

ముర్రుపాలు బిడ్డలో వ్యాధి నిరోధక శక్తిని పెంచి, శరీర ఎదుగుదలను ఇస్తుందని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ తిపేంద్ర నాయక్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లిపాలను శిశువుకు ఇవ్వాలని తెలిపారు. ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలను బిడ్డకు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యాధికారి డాక్టర్ నజీర్, డాక్టర్ మాధవి, డాక్టర్ శైలజ, పిపి యూనిట్ మెడికల్ ఆఫీసర్ సురేష్ నాయక్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ శ్వేత, డాక్టర్ ప్రియ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వాణి, ఎండి అసిస్టెంట్ లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండల పరిధిలోని మదకవారిపల్లి, బుచ్చిరాజు గారిపల్లి, లింగాలవారిపల్లి, తంగేడుకుంట, ఎర్రవల్లి, తదితర గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మంజుల, సూపర్‌వైజర్ విజయకుమారి పాల్గొని తల్లిపాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణమ్మ, వరలక్ష్మి, రత్నమ్మ, నాగలక్ష్మి, నాగరాణి, గంగులమ్మ, గంగాదేవి, అరుణ, విజయభారతి, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ప్రతితల్లి బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించడం మంచిదని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ దేవమణి తెలియజేశారు. మంగళవారం డి.చెర్లోపల్లి గ్రామం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సమావేశానికి సూపర్‌వైజర్ దేవమణి హాజరై తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లి పాలు బిడ్డకి మొదటి టీకాలా పని చేస్తాయన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు పతీంధ్ర, గురుదేవి, అంగన్‌వాడీ వర్కర్లు డి.జయసుధ కె.రమాదేవి, సి.శివలక్ష్మి, హెల్పర్ కె.భాగ్యలక్ష్మి, ఎం.భారతిలు పాల్గొన్నారు.

తలుపుల : మండల కేంద్రంలో 1వ అంగన్వాడీ కేంద్రం ప్రకాష్‌నగర్‌లో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కదిరి సిడిపిఓ రాధిక హాజరై తల్లిపాల ఆవశ్యతను తెలియజేశారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దీప, అలివేలమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిమర్రి : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం తాడిమర్రి నాలుగో అంగన్వాడీ కేంద్రం సిబ్బంది పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు.

విద్యార్థినులకు భద్రత కవచం 'శక్తి యాప్'

ప్రజాశక్తి-హిందూపురం

మహిళలు, విద్యార్థినులకు శక్తి యాప్ భద్రత కవచంగా పనిచేస్తుందని పోలీసులు పేర్కొన్నారు. పట్టణంలోని మేళాపురం దీప్తి పాఠశాలలో మంగళవారం నాడు శక్తి యాప్‌పై విద్యార్థినిలకు పోలీసులు అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారుల భద్రత రక్షణ కోసం పోలీస్ శాఖ శక్తి యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. సెల్ ఫోన్‌లో ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్ ను డౌన్ లోడ్ చేసుకుంటే నిరంతరం ఓ సోదరుడు మీ వెన్నంటే తోడుగా ఉన్నట్లేనని తెలిపారు. చిన్నారులు అదృశ్యమైతే ఆచూకీ గుర్తించేందుకు వారి పేరు, వయసు, చివరిసారిగా చూసిన లొకేషన్ ఫోటోతో వివరాలు అప్ లోడ్ చేస్తే పోలీసులు స్పందించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. డయల్ 100 డయల్ 112 నెంబర్లకు యాప్ ద్వారా నేరుగా కాల్ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ సుధాకర్, కొల్లప్ప, రమాదేవి, పాఠశాల అధ్యక్షులు అబ్రహం కుట్టి, హెడ్‌మిస్ట్రస్ లూసీ, దీపూ షాజి, మెర్సీ షాజీ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరికలు



జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ జిల్లా నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి నియోజకవర్గం జనసేన పార్టీలో పలువురు చేరారు. ఉమ్మడి అనంతపురం జిల్లా జనసేన అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్ సమక్షంలో కదిరి నియోజకవర్గం వర్గం ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో కదిరి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త తుమ్మలరవి, శ్రీనివాసులు, లక్ష్మీపతి, రాము, ఎన్‌పి.కుంట మండలం గూటిబైలు గ్రామం నుంచి మహిళలు జనసేన పార్టీలో చేరారు. వీరికి జిల్లా అధ్యక్షులు వరుణ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు శివ శంకర్, మార్కెట్‌యార్డు ఛైర్‌పర్సన్ మేకల అనసూయమ్మ , జిల్లా నాయకులు కుమ్మర నాగేంద్ర ,ఆవుకు విజయ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జనసేన పార్టీలో అందరికీ సముచిత గౌరవం ఇస్తామని ఆ పార్టీ ముఖ్య నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యులు లక్ష్మణ కుటాల , నాయకులు బ్లూమూన్ శివ శంకర్, చిన్నపరెడ్డి, మేకల చెరువు చౌదరి, సోమశేఖర్, సాకే రవికుమార్, అనుప్రసాద్, అన్నం జయవర్ధన్, అంజిబాబు, చెక్కా రమణ గొందిపల్లి దేవేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వాట్సాప్ ఈ గవర్నెస్ ద్వారా ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందని అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో విద్యార్థులకు వాట్సాప్ గవర్నెస్, మనమిత్రపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. బస్టాండు ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మనమిత్ర, వాట్సాప్ గ్రూప్ ద్వారా ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ కార్యక్రమాల గురించి తెలుసుకోవచ్చన్నారు. ఏదేనీ సమస్యలు, ప్రభుత్వ అందిస్తున్న సేవల గురించి తెలుసుకోవాలంటే ప్రభుత్వ వాట్సప్ నెంబర్ 9552300009కు సందేశం పంపితే సమాచారం అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని ఉపయోగించుకోవలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంగళవారం స్థానిక వైకాపా నేతలు కలిశారు. రాజమండ్రిలో వైకాపా నేత గుడ్డంపల్లి వేణు రెడ్డి ఆధ్వర్యంలో రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు, పార్టీ పరిస్థితి, ప్రజా వ్యతిరేక విధానాలపై అనుసరించాల్సిన నిరసన కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కషి చేయాలని పెద్దిరెడ్డి నేతలకు సూచించారు.

రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కొత్తచెరువు

సత్యసాయి జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జి.కృష్ణప్ప తెలిపారు. జిల్లాలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల సహాయకులు, సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయులు పది సంవత్సరాల సర్వీస్ పూర్తయిన వారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అన్ని మేనేజ్మెంట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. మూడు విభాగాల్లో ఉపాధ్యాయులకు అవార్డులు ఇస్తారన్నారు. ఈనెల 8వ తేదీ విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

పనిచేయని సెల్‌ఫోన్లు మాకొద్దు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

గత ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు సరఫరా చేసిన పని చేయని నాసిరకం మొబైల్ ఫోన్లు తమకొద్దంటూ అంగన్వాడీ టీచర్లు మంగళవారం నాడు ఓడి చెరువు ప్రాజెక్ట్ ఆఫీసులో సెల్‌ఫోన్లను వెనక్కి ఇచ్చేశారు. ఓడి చెరువు ప్రాజెక్టు అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, సెక్టార్, లీడర్లు జయమ్మ, శ్యామల, కళావతి, షమీం, ఆదిలక్ష్మి, విమలమ్మ, సుజాత లక్ష్మీనారాయణమ్మ, వరలక్ష్మి, చంద్రకళ, ఆధ్వర్యంలో ఓడిసి, గౌనిపల్లి, గాజుగుంటపల్లి సెక్టార్ల పరిధిలోని అంగన్వాడీ టీచర్లందరూ సెల్‌ఫోన్‌లను ప్రాజెక్ట్ ఆఫీసులో అప్పగించారు. పని చేయని మొబైల్ ఫోన్లతో విధులు నిర్వహించడం చాలా కష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు స్వర్ణ, సునంద, రమణమ్మ, భారతి, విజయలక్ష్మి, సుహాసిని, యశోద పాల్గొన్నారు.

ముంపు రైతుల సమస్యలపై సిఎం ఆరా

ఎమ్మెల్యే లేఖపై స్పందన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

బుక్కపట్నం చెరువు కింద ముంపు రైతులను ఆదుకోవాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గతంలో విన్నవించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించారు. నిర్దేశిత గడువులోపు సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రాష్ట్ర రెవెన్యూ భూ పరిపాలన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఆదేశం ఇచ్చినట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుక్కపట్నం చెరువు కింద నీటి ముంపురనకు గురై భూములు కోల్పోయి పూర్తిగా జీవనాధారం కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి తన కార్యాలయ ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవి ద్వారా రాష్ట్ర రెవెన్యూ భూ పరిపాలన ప్రత్యేక కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చారు. బుక్కపట్నం చెరువు కింద నీటిముంపునకు గురై భూములు కోల్పోతున్న రైతులకు నిర్దేశించిన కాలంలోగా న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతాం

పరిటాల శ్రీరామ్



వినతులను స్వీకరిస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రజల నుంచి అందుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటికి పరిష్కారం చూపుతామని ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని యర్రాయపల్లి, దంపెట్ల గ్రామాల్లో వేరువేరుగా మీ సమస్య మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. యర్రయపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న సమస్యలను గుర్తించి ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాల మీద సంబంధిత మంత్రులు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రతి అర్జీకి స్థానిక నాయకులు బాధ్యత తీసుకునే విధంగా చూస్తామన్నారు. గ్రామానికి విచ్చేసిన పరిటాల శ్రీరామ్‌కు టిడిపి నాయకులు ఘనంగా స్వాతం పలికారు. దంపెట్లలో జరిగిన కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

మతి చెందిన అంగన్వాడీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

మండలంలోని యర్రాయపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త వాసంతి గత నెలలో మతి చెందారు. ఈమె కుటుంబ సభ్యులను పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జక్కంపూడి సత్యనారాయణ, తెలుగు రైతు ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, సుబ్బరాయుడు, ముల్లగూరు వెంకటేష్, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ ముళ్లగూరు అయ్యప్ప, గోనుగుంట్ల అమర్నాథ్, నెట్టెం రమణ, సంఘాల సూరి, బోయపాటి అప్పస్వామి, నెట్టెం అశోక్, రామాపురం కేశవ, వరిమడుగు కృష్ణారెడ్డి, కట్టకిందపల్లి విశ్వనాథ్, తరిగోపుల చౌదరి, బాలాంజనేయులు యాదవ్, తరిగోపుల చంద్రబాబు, ప్రభాకర్ రెడ్డి, చెర్లోపల్లి శేఖర్, చిదంబ రెడ్డి పాల్గొన్నారు.

నాటుసారా రహిత జిల్లాగా మారుద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ, ఫారెస్టు శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో నవోదయం 2.0 కార్యక్రమం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో డిప్యూటీ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, సత్యసాయి జిల్లా ఎక్సైజ్ అధికారి గోవింద నాయక్, అడిషనల్ ఎస్పీ ఆదినారాయణ, జిల్లా పంచాయతీ అధికారి సమత, డీఈవో క్రిష్టప్ప, ఎస్టీ సంక్షేమ అధికారి మోహన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాటు సారా నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమం మంచి ఫలితాలు ఇచ్చిందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసినందున దాని ఫలితం కనిపిస్తోందన్నారు. జిల్లాలో 19 మండలాలలో 53 గ్రామాలకు నాటుసారా భూతం నుంచి విముక్తి కలిగిందన్నారు. నవోదయం తదుపరి దశలో జిల్లాలో నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించినప్పటికీ తదుపరి నాటుసారా ప్రభావిత గ్రామాల్లో మళ్లీ నాటు సారా పునరావృతం కాకుండా నిరంతర నిఘా ఉంచాలని తెలియజేశారు. నాటుసారా ప్రభావిత గ్రామాల్లో అవగాహన సదస్సులు, కళాజాత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డిడి రాజేంద్ర కుమార్, బి.నరసింహులు పాల్గొన్నారు.

బాల్యవివాహంపై కేసు నమోదు

ప్రజాశక్తి-రొద్దం

బాల్య వివాహం చేసిన ఐదు మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని రొద్దం పంచాయతీ పరిధిలో ఓ గ్రామంలో బాల్య వివాహం చేసిన కుటుంబ సభ్యుల్లో ఐదు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు విచారణ చేసి బాధ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం

ప్రజాశక్తి-హిందూపురం



న్యాయవాది మతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తున్న దశ్యం

అనంతపురానికి చెందిన సీనియర్ న్యాయవాది ఆదిశేషారెడ్డి ఆకస్మిక మతిపై స్థానిక న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం సీనియర్ న్యాయవాది రామచంద్రారెడ్డి ఆదిశేషారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదేశేషారెడ్డితో ఉన్న అనుబంధాన్ని పలువురు న్యాయవాదులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నాగరాజా రెడ్డి, నాగరాజు, సుదర్శన్, సిద్ధు, శ్రీనివాసరెడ్డి, గోపాలకష్ణ, మనోహర్ రెడ్డి, శ్రీరాములు, మురళి, సదాశివరెడ్డి, జయరాం, రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ధర్మవరం రూరల్ : 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో స్వచ్ఛత వారోత్సవాలను నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం కళాశాలలో విద్యార్థులు మొక్కలను నాటారు. కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్ ఆధ్వర్యంలో దేవగన్నేరు, శంఖు, మామిడి, ఉసిరి, నిమ్మ, వేప, రావి తదితర రకాల మొక్కలను కళాశాల ఆవరణలో నాటారు. వీటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి రమేష్, అధ్యాపకులు శిరీష, హరీష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని బాలాజీ నగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. రెండవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాలాజీనగర్‌కు చెందిన గట్టు భాగ్యమ్మ, శ్రీరాముల కమార్తె ఉషారాణి(15) పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ బైపిసి చదువుతోంది. ఈ నెల 4వ తేదీ కళాశాలలో నిర్వహించే ఫేర్‌వెల్ పార్టీకి తనకు కొత్త చీర కొనాలాని ఉషారాణి తండ్రిని అడిగింది. ప్రస్తుతం చీర కొనేందుకు డబ్బులు లేవని తండ్రి చెప్పాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి లోనైన విద్యార్థిని మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం తల్లిదండ్రులు లేచి చూసే సరికి ఉరికి వేలాడుతూ కూతురు కన్పించింది. సమాచారం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గుడిబండ

మండల పరిధిలోని హిరేతుర్పి గ్రామానికి చెందిన కాపు గోవిందప్ప కుమారుడు తిమ్మన్న (70) మంగళవారం విద్యుత్ షాక్ మరణించారు. ఇతనితో పాటు 2 మేకలు ఈ ఘటనలో మతి చెందాయి. మతుని భార్య సాకమ్మ తెలిపిన వివరాల మేరకు... తిమ్మప్ప మంగళవారం అదే గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తికి చెందిన మల్బరీ షెడ్డు వద్దకు మేకలు మేపడానికి తీసుకెళ్లాడు. మేకలను మేపుతున్న క్రమంలో ఉన్నపలంగా షెడ్డు పక్కనే ఉన్న స్తంభానికి అమర్చిన విద్యుత్ వైరు తగలడంతో ఆయన మరణించాడు. పక్కనే ఉన్న రెండు మేకలు కూడా మరణించాయి. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోసానికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి-కదిరి టౌన్

లేని స్థలాన్ని ఉన్నట్లు చూపించి రిజిస్టర్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కదిరి పట్టణం షాకీర్ స్ట్రీట్ వలిసాబ్ రోడ్‌లో నివాసం ఉంటున్న షేక్ మహమ్మద్ షఫి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కదిరి పట్టణం పోలీసు లైన్‌లో ఉండే తుమ్మల ఇలియాజ్ కందికుంట నారాయణమ్మ కాలనీలో సర్వే నెంబర్ 243 నందు గల 70 సెంట్లు లేని స్థలం ఉన్నట్లు చూపించి విక్రయించాడు. ఆక్కడ స్థలం లేదని తేలడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోసం చేయడమే కాకుండా బెదిరింపులకు దిగుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడు పిర్యాదు మేరకు తుమ్మల ఇలియాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆక్రమిత భూములను గుర్తించండి

జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో చెరువులు ప్రాజెక్టులు వాగులు వంకలపై అనధికారికంగా ఆక్రమించన భూములను గుర్తించి వాటికి సంబంధించిన ప్రణాళికలు స్కెచ్‌లు సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సంబంధిత అధికారులను మాదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో వాటర్ బాటిల్స్, వాచ్ డాగ్‌పై జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఆక్రమించబడిన భూములను తక్షణమే గుర్తించి వాటికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలను సిద్ధం చేసి సమర్పించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పెనుకొండ, ధర్మవరం ఆర్డీవోలు ఆనంద్ కుమార్, మహేష్, ఇరిగేషన్ డిఈలు, ఏఈలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

శ్రీవెన్ టెక్నాలజీ వ్యర్థాల కేంద్రం పరిశీలన



శ్రీవెన్ కేంద్రంలో వ్యర్థాలను పరిశీలిస్తున్న కూటమి నేతలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండల పరిధిలోని దంపెట్ల గ్రామశివారులో ఏర్పాటు చేసిన శ్రీవెన్ టెక్నాలజీస్ బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరీష్ బాబు మంగళవారం పరిశీలించారు. శ్రీవెన్ వ్యర్థాలపై ఇటీవల స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించి శ్రీవెన్ యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడారు. పర్యావరణానికి హాని లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే చర్యలను ఉపేక్షించమని తెలియజేశారు. ప్రజల ఆరోగ్యం దెబ్బతినేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి బత్తలపల్లి మండల అధ్యక్షుడు ఆకులేటి భాస్కర్, టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, ఆకులేటి వీరనారప్ప, పోతుకుంట రాజు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలో పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ పంట నమోదు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి తెలియజేశారు. మంగళవారం మండల పరిధిలోని పి కొత్తపల్లి, బందారుచెట్లపల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ఈ పంట నమోదు చేసుకోకపోతే ప్రభుత్వం ఇచ్చే పంట నష్ట పరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్, యాంత్రీకరణ తదితర పథకాలు అందజే అవకాశం ఉండదన్నారు. అర్హులై ఉండి పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ అందని రైతులు ఆయా సచివాలయాల్లో ఆధార్‌కార్డు ఇతర ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీకష్ణ నాయక్, ఆఫియా, రైతులు పాల్గొన్నారు.

పి-4తో పేదల జీవితాల్లో వెలుగు

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి-4 పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ తెలిపారు. కదిరి పట్టణం కుటాగుళ్ల 36వ వార్డు ఇన్‌ఛార్జి హరి అధ్వర్యంలో జీరో పావర్టీ పి4 కార్యక్రమంలో భాగంగా, కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాలో టీడీపీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ మాట్లాడుతూ పీ4 పథకం పేదల జీవన శైలిని మార్చే మార్గదర్శి అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ ఆశలత, టీడీపీ నాయకులు ఆజాం, బాషా, శ్రీరాములు బాబాసాబ్ ప్రకాష్ గంగన్న జయరాం శ్రీనివాసులు సచివాలయం అధికారులు తదితరులు పాల్గొన్నారు

దురలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థి, యువత దురలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని హిందూపురం ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కెసికె.నాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్ఎస్‌పి ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ప్రగతి అధ్యక్షతన యాంటీ డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేసికే నాయక్ మాట్లాడుతు వైద్య, విజ్ఞానంపై విద్యార్థులకు కనీస పరిజ్ఞానం ఉండాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్ లో అందుబాటులో ఉండే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం వెంకటేశులు, ఐక్యు ఎసి కోఆర్డినేటర్ డా॥శ్రీలక్ష్మి, యన్‌సిసి ఆఫీసర్ సరస్వతి, అధ్యాపకులు బోజప్ప, రవి నాయక్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రంగనాయకులు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ అమరేష్, డయాగ్నటిక్ సెంటర్ ఇన్‌ఛార్జ్ హరీష్, ఫార్మసిస్ట్ హాఫీజ్, జార్జియా దేశంలో ఎంబిబిఎస్ విద్యనభ్యసిస్తున్న నిహా కౌశర్ పాల్గొని ప్రసంగించారు.